క్లుప్తంగా

27న మండల పరిషత్ కార్యాలయ గదుల వేలం

కలికిరి: మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయ కాంప్లెక్స్ గదులు అద్దె ప్రాతిపదికన కేటాయించడానికి ఈ నెల 27న బహిరంగ వేలం నిర్వహించనున్నట్లు ఎంపీపీ నూర్జహాన్, ఎంపీడీఓ గంగయ్య తెలిపారు. మొత్తం 12 గదులకు గాను ప్రభుత్వ నిబంధనల మేరకు వేలంలో పాల్గొనువారు మండల పరిషత్ డెవలప్‌మెంట్ ఆఫీసర్, కలికిరి వారి పేరున స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా నందు డీడీ సమర్పించాల్సి ఉంటుందని పేర్కొన్నారు. బహిరంగ వేలంలో గదులు దక్కించుకున్న వారికి 01-06-2023 నుంచి 30-06-2026 వరకు మూడు సంవత్సరముల పాటు అద్దెకు కేటాయించడం జరుగుతుందని తెలిపారు.

మద్యం బాటిళ్లు స్వాధీనం

పెద్దమండ్యం: మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకుని ఒకరిని అరెస్ట్ చేసినట్లు ఎస్ఐ వినోద్ కుమార్ బుధవారం తెలిపారు. ఎస్ఐ కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. తంబళ్లపల్లె మండలం ఉప్పులూరివాండ్లపల్లెకు చెందిన ప్రసాద్ అనే వ్యక్తి మద్యం బాటిళ్లతో పెద్దమండ్యం బస్టాండులో ఉండగా పట్టుబడినట్లు తెలిపారు. ఇతని వద్ద 140 మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. ఈ మేరకు కేసు నమోదు చేసి, అరెస్ట్ చేసినట్లు తెలిపారు. ఎక్కడైనా అక్రమంగా మద్యం, నాటుసారా తయారీ, విక్రయాలు చేస్తే వారిపై చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు.

మండల అభివృద్ధిపై దృష్టిసారించండి

కలికిరి: మండల అభివృద్ధిపై దృష్టి సారించాలని పీలేరు ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి సూచించినట్లు ఎంపీపీ నూర్జహాన్ తెలిపారు. వాల్మీకిపురంలో బుధవారం ఎమ్మెల్యే చింతలను కలిసి మండలంలో జరుగుతున్న, అవసరమైన అభివృద్ధిపై చర్చించి, తీసుకోవాల్సిన చర్యలపై ఎమ్మెల్యేకి వివరించినట్లు ఆమె తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీఓ గంగయ్య పాల్గొన్నారు.

హజ్ యాత్రికుల భారం మోసిన ప్రభుత్వం

బి.కొత్తకోట: హజ్‌కు వెళ్లే యాత్రికులపై కేంద్ర ప్రభుత్వం మోపిన భారాన్ని సీఎం వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం భరించిందని వక్ఫ్ బోర్డు జిల్లా చైర్మన్ ఎస్‌ఏ.కరీముల్లా అన్నారు. బుధవారం ఆయన మాట్లాడుతూ గతంలో లేనివిధంగా హజ్‌కు వెళ్లే పేద ముస్లిం యాత్రికులపై కేంద్రం రవాణా చార్జీల భారం మోపిందన్నారు. సమస్యపై స్పందించిన సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఒక్కో యాత్రికునికి రూ.80వేలు ఆర్థిక సహాయం అందిస్తూ నిర్ణయించారని చెప్పారు. ఈ నిధులను హజ్ యాత్రకు వెళ్లే భక్తుల ఖాతాల్లోకి ప్రభుత్వం జమ చేయనుందని చెప్పారు.

20 లీటర్ల సారా స్వాధీనం

పీలేరు : మండలంలో 20 లీటర్ల సారా స్వాధీనం చేసుకుని ముగ్గురు నిందితులను అరెస్ట్ చేసినట్లు సెబ్ సీఐ వై. గురుప్రసాద్ తెలిపారు. వివరాలిలావున్నాయి. మండలంలోని రేగళ్ల పంచాయతీ తూగుంటపల్లె పరిసర ప్రాంతాల్లో సారా తయారీ చేస్తున్నట్లు అందిన సమాచారంతో దాడులు నిర్వహించారు. ఈ సందర్భంగా సారా స్వాధీనం చేసుకుని సుమారు 200 లీటర్ల బెల్లం ఊటను ధ్వంసం చేసినట్లు సీఐ తెలిపారు. తూగుంటపల్లెకు చెందిన శివకుమార్, టి. కృష్ణయ్య, టి. మునిలక్ష్మమ్మలను అరెస్ట్ చేసినట్లు చెప్పారు. ఈ దాడిలో ఎస్ఐ లక్ష్మీనరసయ్య, సిబ్బంది యోగానంద, సురేష్, సుధాకర్, గంగామహేశ్వరి పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం



గురువులతో పూర్వ విద్యార్థులు

కేవీపల్లె : ఆనాటి జ్ఞాపకాలు ఎంతో మధురమని గురువులు అన్నారు. బుధవారం కేవీపల్లె జెడ్పీ ఉన్నత పాఠశాలలో 1997–98 బ్యాచ్‌కు చెందిన పూర్వ విద్యార్థులు, అప్పటి ఉపాధ్యాయుల సమ్మేళనం నిర్వహించారు. వివిధ ఉద్యోగాల్లో స్థిరపడిన పూర్వ విద్యార్థులు 25 ఏళ్ళ అనంతరం కలుసుకుని నాటి తీపి జ్ఞాపకాలు గుర్తుకు తెచ్చుకున్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో గురువులు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ సేవా భావం అలవర్చుకోవాలని కోరారు. కేవీపల్లె జెడ్పీ ఉన్నత పాఠశాల అభివృద్ధికి తమ వంతు సహకారం అందించాలని కోరడంతో పూర్వ విద్యార్థులు స్పందించి మౌలిక వసతుల కల్పనకు సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు. అనంతరం గురువులను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం వై.వి. రమణ, అప్పటి గురువులు నరసింహారెడ్డి, రామాంజులునాయుడు, తిరుమలాచారి, సురేంద్రరెడ్డి, సుశీల, హరినాథరెడ్డి, అబ్దుల్‌ఆలాం పాల్గొన్నారు.

వైభవంగా వెంకటరమణ స్వామి ఉత్సవాలు

బి.కొత్తకోట: మండలంలోని గట్టులో వెలసిన టీటీడీ అనుబంధ ఆలయం ప్రసన్న వెంకటరమణస్వామి ఉత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. బుధవారం ఆలయంలో శెట్టివారు, లింగాయత్ కుటుంబాలు ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామివారి విగ్రహానికి ప్రత్యేక అలంకరణలు చేశారు. శ్రీదేవి, భూదేవి సమేత వెంకటరమణ ఉత్సవ మూర్తులను ఊరేగించారు.

ప్రభుత్వ పాఠశాలల్లో ఉత్తమ ఫలితాలు



మదనపల్లె: ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులను అభినందిస్తున్న లలితమ్మ



కేవీపల్లె: సౌమ్యశ్రీని సత్కరిస్తున్న అధికారులు, ఎమ్మార్పీఎస్ నాయకులు

మదనపల్లె : ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య, మెరుగైన మౌలికవసతులు, అంకితభావం, ప్రతిభ కలిగిన ఉపాధ్యాయులు, అమ్మఒడి, గోరుముద్ద, విద్యాకానుక పథకాల కారణంగా ఎంతోమంది విద్యార్థులు ఉత్తమఫలితాలు సాధించడం అభినందనీయమని పోర్డ్ డైరెక్టర్ జిల్లా లలితమ్మ తెలిపారు. బుధవారం స్థానిక ప్రశాంత్‌నగర్‌లోని ఆ సంస్థ కార్యాలయంలో పదోతరగతి పరీక్షల్లో అధిక మార్కులు సాధించిన ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు అభినందన సభ ఏర్పాటు చేశారు. విద్యార్థుల ప్రతిభను ప్రశంసించి, వారికి ప్రోత్సాహకంగా మొమెంటో, మొక్కలను పంపిణీ చేసి చిరు సత్కారం చేశారు. ఈ సందర్భంగా జిల్లా లలితమ్మ మాట్లాడుతూ.. కార్పొరేట్, ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించడంపై ప్రభుత్వానికి, విద్యార్థుల తల్లిదండ్రులకు అభినందనలు తెలిపారు. మంచి ఫలితాలు సాధించిన విద్యార్థులు భవిష్యత్తులోనూ చదువుపై ఇలాగే శ్రద్ధను కొనసాగిస్తూ జిల్లా, రాష్ట్ర స్థాయిలో ఉత్తమ ఫలితాలు సాధించాలన్నారు. రాష్ట్రస్థాయిలో 600 మార్కులకు 595 సాధించి రెండోస్థానంలో నిలిచిన విజయభారతి పాఠశాల విద్యార్థిని ఉన్నతిరెడ్డికి జ్ఞాపికను బహుకరించి దుశ్శాలువతో సత్కరించారు. నీరుగట్టువారిపల్లె వివేకానంద హైస్కూల్, జెడ్పీహైస్కూల్, హోప్ మున్సిపల్ హైస్కూల్, ప్రభుత్వ బాలికల హైస్కూల్, బాపూజీ, నెహ్రూ, ఉర్దూ పాఠశాల, ఎస్టీ గురుకులంకు చెందిన విద్యార్థులు వి.నందిని, హిమసాయి, రాఘవి, ఛాయకృష్ణ, ఈ.శ్రావణి, జి.వంశీ, షేక్ షియాఫాతిమా, కె.సురేష్‌నాయక్, జాస్మిన్‌తాజ్ తదితరులను సత్కరించారు. కార్యక్రమంలో పోర్డ్ ప్రోగ్రామ్ కోఆర్డినేటర్ శ్రీధర్, మండల కోఆర్డినేటర్ రాధారాణి, ఆవులనరసింహులు, అల్తాఫ్‌హుస్సేన్, సంపూర్ణ, ప్రభావతి, జ్యోతి, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థినికి సత్కారం

కేవీపల్లె : పదో తరగతి ఫలితాల్లో మండలంలో ఉత్తమ మార్కులు 586 సాధించిన ఏపీ మోడల్ స్కూల్ విద్యార్థి సౌమ్యశ్రీకి అభినందనలు తెలపారు. బుధవారం ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో అభినందన సభ ఏర్పాటు చేశారు. విద్యార్థిని సౌమ్యను శాలువ, పుష్పగుచ్ఛంతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ నరసింహులు, ఎస్ఐ లోకేష్, ఇన్‌చార్జి ఎంపీడీవో లతీఫ్‌ఖాన్, ఎమ్మార్పీఎస్ నాయకులు రామకృష్ణ, వెంకటేష్, విజయభాస్కర్, శ్రీరాములు, గురవయ్య, ఎస్. వెంకటేష్, వెంకటరమణ, రమణ, రామాంజులు, వీరాంజనేయలు, యల్లీశ్వర తదితరులు పాల్గొన్నారు.

బాలికల జూనియర్ కాలేజీలో ప్రవేశాలకు ఆహ్వానం

మదనపల్లె : పట్టణంలోని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో 2023–24 విద్యాసంవత్సరానికి ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరంలో ప్రవేశానికి పదోతరగతి పూర్తి చేసిన విద్యార్థినుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ గోపతి బాలకృష్ణమూర్తి తెలిపారు. బుధవారం కళాశాలలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. తమ కళాశాలకు చెందిన విద్యార్థినులు కార్పొరేట్ కళాశాలలకు దీటుగా ఇంటర్మీడియట్ ఫలితాల్లో ఎంపీసీ, బైపీసీ, సీఈసీ విభాగాల్లో అత్యుత్తమ ఫలితాలు సాధించారన్నారు. ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో ఎంపీసీ, బైపీసీ, సీఈసీ, హెచ్ఈసీ(తెలుగు, ఇంగ్లీషు మీడియం), వొకేషనల్ కోర్సులు నర్సింగ్, సీ.జి.టి.(గార్మెంట్ టెక్నాలజీ), సీ.టీ.(కన్‌స్ట్రక్షన్ టెక్నాలజీ), సిరికల్చర్, అకౌంట్స్, టాక్సేషన్ కోర్సులు ఉన్నాయన్నారు. కళాశాలలో.. చక్కటి క్రమశిక్షణ, విద్యార్థినులకు అవసరమైన ఫర్నిచర్, ఆర్వో వాటర్, టాయిలెట్స్, కౌన్సిలింగ్, గైడెన్స్ విభాగం, పేరెంట్స్‌కమిటీ మీటింగ్స్, ప్రోగెస్‌కార్డ్స్, ఉచిత పుస్తకాలు, విద్యార్థినులపై ప్రత్యేక పర్యవేక్షణ ఉంటుందన్నారు. ప్రతి విద్యార్థిని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల సేవలను వినియోగించుకోవాలన్నారు. తమ కళాశాలలో చేరి ఉజ్వల భవిష్యత్తుకు భరోసా పొందాలని కోరారు.

నాడు – నేడు పనుల తనిఖీ



అంగన్‌వాడీ భవన నిర్మాణాన్ని పరిశీలిస్తున్న ఇన్‌చార్జి పీడీ ధనలక్ష్మి

నిమ్మనపల్లె : నాడు–నేడు రెండో విడత పనులను జిల్లా ఐసీడీయస్ ఇన్‌చార్జి పీడీ ధనలక్ష్మి బుధవారం తనిఖీ చేశారు. మండలంలోని రాచవేటివారిపల్లె పంచాయతీలోని బొంతవారిపల్లె అంగన్‌వాడీ కేంద్రం రెండో విడత నాడు – నేడు పనులకు ఎంపికైంది. అక్కడ జరుగుతున్న భవన నిర్మాణ పనులను పీడీ, మదనపల్లె సీడీపీవో సుజాతతో కలిసి తనిఖీ చేశారు. పనులు వేగంగా పూర్తి చేయాలన్నారు. పనుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం రాచవేటివారిపల్లెలోని అంగన్‌వాడీ కేంద్రాన్ని తనిఖీ చేశారు. అక్కడ పిల్లలు, బాలింతలు, గర్భిణులకు అందుతున్న పోషకాహార వివరాలను అడిగి తెలుసుకున్నారు. వారి ఆరోగ్య స్థితిపై అంగన్‌వాడీ కార్యకర్తను ప్రశ్నించారు. బాలింతలు, గర్భిణులతో మాట్లాడారు. తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. వైఎస్సార్ పోషణ కిట్లు సద్వినియోగం చేసుకోవాలన్నారు. బాలింతలు సరైన పోషకాహారం తీసుకోవాలన్నారు. పిల్లలు బరువు తక్కువ కాకుండా అంగన్‌వాడీ కార్యకర్తలు నిరంతర పర్యవేక్షణ చేయాలన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ సుబ్రహ్మణ్యం, అంగన్‌వాడీ సూపర్‌వైజర్ భానులక్ష్మిదేవి, హెల్పర్ హసీనా తదితరులు పాల్గొన్నారు.

మెరుగైన సేవలు అందించాలి

సచివాలయ సిబ్బంది సమన్వయంతో పని చేస్తూ ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని జిల్లా పంచాయతీ అధికారి (డీపీవో) ధనలక్ష్మి అన్నారు. బుధవారం మండలంలోని రాచవేటివారిపల్లె సచివాలయం, సంపద తయారీ కేంద్రాన్ని ఎంపీడీవో లీలా మాధవితో కలిసి ఆకస్మికంగా తనిఖీ చేశారు. హాజరు పట్టికను పరిశీలించారు. సచివాలయం పరిధిలో జరుగుతున్న లావాదేవీలపై డిజిటల్ అసిస్టెంట్‌ను అడిగి తెలుసుకున్నారు. వేసవిని జాగ్రత్తలను ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారా.? అంటూ ఏఎన్‌ఎంను ప్రశ్నించారు. అగ్రికల్చర్ అసిస్టెంట్, వెటర్నరీ అసిస్టెంట్‌లను వారి విధులకు సంబంధించి ప్రశ్నించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ సచివాలయ సిబ్బంది కార్యదర్శికి సహాయ సహకారాలు అందించాలన్నారు. సచివాలయానికి వచ్చే ప్రజలతో మర్యాద పూర్వకంగా నడుచుకోవాలన్నారు. సిబ్బంది సమయపాలన, డ్రెస్‌కోడ్ తప్పనిసరిగా పాటించాలన్నారు. స్పందన కార్యక్రమాన్ని ప్రతిరోజూ నిర్వహించాలన్నారు. డిజిటల్ లావాదేవీల సంఖ్య పెంచాలన్నారు. అనంతరం సిబ్బందితో కలిసి సంపద తయారీ కేంద్రం వద్దకు వెళ్లారు. అక్కడ చెత్త తొట్టెలను పరిశీలించారు. గ్రామంలో చెత్తను సేకరించి నాడాప్ పిట్స్ చేర్చాలన్నారు. వర్మీకంపోస్టు తయారీలో భాగంగా తొట్టెల్లో వానపాములు వదలాలన్నారు. ఒకొక్క తొట్టెలో పది కిలోల వానపాములు వదిలిపెట్టాలన్నారు. డంపింగ్‌యార్డు చుట్టూ పెన్సింగ్స్ ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఎస్‌డబ్ల్యూపీసీ విధుల్లో భాగమైన అగ్రికల్చర్ అసిస్టెంట్, వెటర్నరీ అసిస్టెంట్ సహాయ సహకారాలు అందించాలన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ సుబ్రహ్మణ్యం, పంచాయతీ కార్యదర్శి గాయత్రి పాల్గొన్నారు.

ఒత్తిడిని అధిగమించడానికి యోగా సాధన చేయాలి

పీలేరు : గర్భవతులు ఒత్తిడిని అధిగమించడానికి యోగా సాధన అలవర్చుకోవాలని డాక్టర్ చంద్రోఖర్‌నాయక్ అన్నారు. బుధవారం తలపుల పీహెచ్‌సీ పరిధిలోని బండ్లవంకలో యోగ సాధన – ప్రయోజనాలు అంశంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యోగ సాధనతో బహుళ ప్రయోజనాలు పొందవచ్చునని తెలిపారు. గర్భిణులు ఆరోగ్య స్థితిని బట్టి సంబంధిత వైద్య నిపుణులతో నిర్ధారించుకోవాలన్నారు. ప్రధానంగా శారీరక, మానసిక ఒత్తిడిని తగ్గించడమే కాకుండా, నిద్రను మెరుగుపరుస్తుందని తెలిపారు. అనవసర భయాలను అడ్డుకుంటుందని, వాంతులు, నీరసాన్ని తగ్గిస్తుందని చెప్పారు. జనన ప్రమాదాన్ని తగ్గించి తల్లికి బలం, ఓర్పు, నేర్పు, సామర్థ్యం పెంచడం తోపాటు ప్రసవ ఫలితాలు మెరుగుపరుస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో హెచ్ఈ కొండయ్య, ఏఎన్‌ఎం భార్గవి, సీహెచ్‌వో చంద్రకళ, మహిళా పోలీస్ రజిని పాల్గొన్నారు.

వైభవంగా గంగ జాతర



గంగజాతరలో పాల్గొన్న ఎమ్మెల్యే నవాజ్‌బాషా

రామసముద్రం: రామసముద్రం మండలం ఆర్.నడింపల్లె పంచాయతీ జంగాలపల్లె , ఆర్.కమతంపల్లె గ్రామాల్లో బుధవారం అంగరంగ వైభవంగా గంగజాతర నిర్వహించారు. మంగళవారం రాత్రి 11 మంది గ్రామ దేవతలకు మహిళలు ఉపవాసాలతో దీపాలు మోసి మొక్కులు చెల్లించుకున్నారు. గ్రామ దేవత గంగమ్మను గ్రామంలో ఊరేగించారు. మదనపల్లె నియోజకవర్గ ఎమ్మెల్యే నవాజ్‌బాషా అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆయనతో పాటు స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు. జాతరకు రావడం ఆనందగా ఉందని ఎమ్మెల్యే తెలిపారు. ప్రజలు సుఖశాంతులు, ఆయురారోగ్యాలతో ఉండి పంటలు బాగా పండి రైతులు ఆనందంగా ఉండాలని అమ్మవారిని వేడుకున్నట్ల ఎమ్మెల్యే తెలిపారు. అనంతరం స్థానిక సర్పంచ్ ఆదినారాయణ నివాసంలో ఏర్పాటు చేసిన విందులో పాల్గొన్నారు. చుట్టు పక్కల ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఎమ్మెల్యేతో పాటు జెడ్పీటీసీ రామచంద్రారెడ్డి, సింగిల్‌విండో అధ్యక్షుడు కేశవరెడ్డి, వైస్‌ఎంపీపీ రమణారెడ్డి, మండల కన్వీనర్ భాస్కర్‌గౌడ్, స్థానిక ఎంపీటీసీ రెడ్డిశేఖర్, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

పేదరిక నిర్మూలనే ధ్యేయం

– ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి



ప్రజల సమస్యలను తెలుసుకుంటున్న ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి

వాల్మీకిపురం: పేదరిక నిర్మూలనే రాష్ట్ర ప్రభుత్వం ధ్యేయం అని ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని జర్రావారిపల్లి పంచాయతీ వడ్డిపల్లి, మల్‌రెడ్డిగారిపల్లి, ఎర్రంరెడ్డిగారిపల్లి గ్రామాల్లో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇందులో భాగంగా పీలేరు ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి ఇంటింటికి వెళ్లి పథకాలను వివరించి, సమస్యలను అడిగి తెలుసుకున్నారు. రోడ్లు, కాలువలు, విద్యుత్ స్తంభాలు, విద్యుత్ దీపాలు, పింఛన్లు, ఇండ్లు తదితర సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు. దీనిపై స్పందించిన ఎమ్మెల్యే చింతల మాట్లాడుతూ ప్రజా సమస్యలను అధికారులు ఎప్పటికప్పుడు పరిష్కరించాలన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాల ద్వారా రాష్ట్రంలోని అన్ని వర్గాల ప్రజలు ఆనందంగా ఉన్నారన్నారు. కుల, మత, రాజకీయాలకు అతీతంగా సంక్షేమ పథకాలు అందించడంలో వలంటీర్లు ముఖ్య భూమిక పోషిస్తున్నారన్నారు. సంక్షేమ పథకాల అమలు, రూపాయి లంచం లేకుండా నేరుగా అర్హులకే చేరే విధానం దేశానికే ఆదర్శంగా నిలుస్తున్నాయన్నారు. అన్నివర్గాల వారికి మంచి చేస్తూ వస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి అందరి గుండెల్లో కొలువై ఉన్నాడన్నారు. ప్రజలకు ఎలాంటి సమస్యలు ఎదురైనా వలంటీర్ల ద్వారా అధికారుల దృష్టికి తీసుకొస్తే, సమస్యను పరిశీలించి పరిష్కరిస్తారని తెలిపారు. దేశంలోని ఇతర రాష్ట్రాల ముఖ్యమంత్రులు కూడా సీఎం జగన్మోహన్ రెడ్డి ప్రవేశ పెట్టిన వలంటీర్ వ్యవస్థ, ఇతర పథకాలు అమలు చేయాలనే ఆలోచనలో ఉన్నారన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీ ఎండీసీ డైరెక్టర్ హరీష్ రెడ్డి, జెడ్పీటీసీ నిర్మల, మార్కెట్ కమిటీ చైర్మన్ రవినాయక్, సర్పంచ్ మునిభాస్కర్, కురబ కార్పొరేషన్ డైరెక్టర్ నరసింహులు, మండల కన్వీనర్ నీళ్ల భాస్కర్, నాయకులు చంద్రశేఖర్, ఆనంద, రాయుడు, వేణుగోపాల్ రెడ్డి, రవి, విశ్వనాథం, రాజబాబు, చిన్నోడు, చలపతి, సుబ్బు, పట్టాభి, రామారావు తదితరులు పాల్గొన్నారు.

ఫ్యామిలీ డాక్టర్ సేవలు వరం



మాట్లాడుతున్న డీపీఎంఓ డాక్టర్ లోకవర్ధన్

కలికిరి: ప్రభుత్వం ఫ్యామిలీ డాక్టర్ కాన్సెప్ట్ ప్రజలకు వరం అని, ఇంటి వద్దకే వైద్య సేవలు అందుతాయని డీపీఎంఓ డాక్టర్ లోకవర్ధన్ తెలిపారు. మండలంలోని గుండ్లూరు గ్రామం గుంటివీరన్నపల్లిలో జరుగుతున్న ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమాన్ని ఆయన తనిఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ జీవనశైలి విధానంలో చోటు చేసుకున్న మార్పులతో అత్యధికంగా రక్తపోటు సంక్రమిస్తోందని, ప్రతి ఒక్కరూ శరీర వ్యాయామం అలవరచుకోవాలని సూచించారు. ఆకుకూరలు, కాయగూరలు ఆహారంలో ఉండేటట్లు చూసుకోవాలన్నారు. ప్రజలు తప్పనిసరిగా జాగ్రత్తలు పాటించాలన్నారు. కార్యక్రమంలో మేడికుర్తి పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ చిన్నారెడ్డెప్ప, హెచ్ఈ మహమ్మద్ రఫీ, ఎంఎల్‌హెచ్‌పీ పూజిత, ఏఎన్‌ఎం, ఆశా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ఇళ్ల నిర్మాణంలో పురోగతి సాధించాలి

– మున్సిపల్ కమిషనర్ కే.ప్రమీల



హౌసింగ్ ప్రగతిపై సమీక్షా సమావేశం నిర్వహిస్తున్న కమిషనర్ ప్రమీల

మదనపల్లె : వైఎస్సార్ జగనన్న కాలనీ లేఅవుట్లలో ఇళ్ల నిర్మాణ పనుల్లో పురోగతి సాధించాలని మున్సిపల్ కమిషనర్ కే.ప్రమీల వార్డు సచివాలయ సిబ్బందిని ఆదేశించారు. బుధవారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో హౌసింగ్ ప్రగతిపై డీఈ రామస్వామిరెడ్డితో కలిసి వార్డు సచివాలయ సిబ్బందితో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ కే.ప్రమీల మాట్లాడుతూ..మున్సిపాలిటీకి మొదటివిడతలో మంజూరైన ఇళ్లకు సంబంధించి 2,500 గృహాలు పునాదుల స్థాయిలో నిలిచిపోగా, కొత్తగా మంజూరైన 1,050 గృహాలకు సంబంధించి ఇప్పటివరకు పనులు ప్రారంభం కాలేదన్నారు. ఇళ్ల నిర్మాణాల ప్రగతిపై జిల్లా కలెక్టర్ ప్రతిరోజు సెల్ కాన్ఫరెన్స్ నిర్వహిస్తామని ప్రకటించిన నేపథ్యంలో ఏరోజుకారోజు అభివృద్ధి కనిపించేలా జాగ్రత్తపడాలన్నారు. బీబీఎల్‌లో ఉన్నవన్నీ బీఎల్‌కు, బీఎల్‌లో ఉన్నవన్నీ ఆర్ఎల్, ఆర్ఎల్‌లో ఉన్నవి ఆర్‌సీ దశకు తీసుకురావాలని, ఇంటి నిర్మాణంలో స్టేజ్ అప్‌డేషన్ కచ్చితంగా కనిపించాలన్నారు. వార్డు సచివాలయంలోని వీఆర్వో, వెల్‌ఫేర్, ఇంజనీరింగ్ సెక్రటరీ, వార్డు అడ్మిన్‌లు నలుగురూ సమన్వయంతో పనిచేసి 3,500 ఇళ్ల నిర్మాణ లక్ష్యాన్ని త్వరితగతిన సాధించాలన్నారు. సమావేశంలో ఏఈ దీనదయాళ్‌రాజు, మున్సిపల్, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మహిళా రెజ్లర్ల న్యాయ పోరాటానికి మద్దతు



మాట్లాడుతున్న సాంబశివ

మదనపల్లె : అంతర్జాతీయ క్రీడావేదికలైన ఒలింపిక్స్, కామన్‌వెల్త్, ఏషియన్‌గేమ్స్ పోటీలలో పతకాలను సాధించి భారతదేశ కీర్తిప్రతిష్టలను ప్రపంచానికి చాటిచెప్పిన మహిళా మల్లయోధులు (రెజ్లర్స్)పై లైంగిక వేధింపులకు పాల్పడిన డబ్ల్యూఎఫ్ఐ అధ్యక్షులు ఎంపీ బ్రిజ్‌భూషణ్‌ను తక్షణమే అరెస్ట్ చేయాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి సాంబశివ డిమాండ్ చేశారు. మహిళా రెజ్లర్లకు మద్దతుగా బుధవారం స్థానిక సంతగేటు ఏఐటీయూసీ కార్యాలయంలో రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సాంబశివ మాట్లాడుతూ.. కంచె చేను మేసినట్లు రక్షకుడే తమపై లైంగిక వేధింపులకు పాల్పడుతున్నాడని 2016లో మహిళా రెజ్లర్లు రిపోర్ట్ చేసినా చర్యలు లేవన్నారు. రెజ్లర్స్ అంతర్జాతీయ స్థాయిలో పతకాలు సాధించినప్పుడు వారిని ఇంటికి పిలిపించుకుని ఫోటోలు తీయించుకుని గొప్పలు చెప్పుకునే ప్రధాని మోదీ ఇప్పుడు వారి గోడును పట్టించుకోకపోవడం దారుణమన్నారు. పనిప్రదేశాల్లో, ఫ్యాక్టరీల్లో, ఆఫీసుల్లో ప్రతిచోటా మహిళలపై అధికారులు లైంగిక వేధింపులకు పాల్పడుతూనే ఉన్నారన్నారు. మహిళలపై అత్యాచారాలకు, హత్యలకు ఒడిగడుతున్న నిందితులను కాపాడుతున్న కేంద్రప్రభుత్వ వైఖరిని ఖండించారు. న్యాయం కోసం ఆందోళన చేస్తున్న మహిళా రెజ్లర్ల ఉద్యమానికి దేశప్రజలు, మహిళలు, క్రీడాకారులు మద్దతు తెలపాలని కోరారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ పట్టణ కార్యదర్శి దేవ, ఆటో వర్కర్స్ యూనియన్ నాయకులు రవి, స్కూల్ స్వీపర్స్ యూనియన్ నాయకులు రవీంద్ర, మహిళా సంఘం నాయకురాలు గంగులమ్మ, మంజుల, సరళమ్మ, నాగరాణి, రాణెమ్మ పాల్గొన్నారు.

ఏపీఆర్ మైనార్టీ గురుకుల కళాశాల అడ్మిషన్లు

వాల్మీకిపురం: స్థానిక తరిగొండ రోడ్డులోని ఏపీఆర్ మైనార్టీ గురుకుల జూనియర్ కళాశాల మొదటి సంవత్సరం అడ్మిషన్లు ప్రారంభ మయ్యాయని కళాశాల ప్రిన్సిపల్ రమామంజుల తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తమ కళాశాలలో ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరంలో ఎంపీసీ గ్రూపులో 32, బైపీసీ గ్రూపులో 32, సీఈసీ గ్రూపులో 28 ఖాళీ సీట్లు ఉన్నాయన్నారు. 2022–23 విద్యా సంవత్సరంలో ఎస్ఎస్‌సి పరీక్షల్లో అర్హత సాధించిన వారు మాత్రమే అర్హులన్నారు. ఉచిత విద్య, ఉచిత వసతి, ఉచిత భోజనం సదుపాయంతో పాటు ఇంగ్లీష్ మీడియం విద్య బోధన, డిజిటల్ తరగతుల నిర్వహణ ఉంటుందన్నారు.

గంగమ్మతల్లీ ... దీవించమ్మా



పట్టు వస్త్రాలు, జ్యోతులు ఊరేగింపుగా తీసుకెళుతున్న భక్తులు

తంబళ్లపల్లె: కోటకొండ గంగమ్మ తల్లీ దీవించమ్మా..రాష్ట్రం పాడిపంటలతో సుభిక్షంగా, ప్రజలు సుఖశాంతులతో ఉండాలని ఎమ్మెల్యే ద్వారకనాథరెడ్డి సతీమణి కవితమ్మ కోరారు. మండల కేంద్రానికి సమీపంలోని వారపుసంత తోపులో వెలసిన కోటకొండ గంగమ్మ ఆలయంలో బుధవారం వైభవంగా తిరునాల సాగింది. ఎమ్మెల్యే సతీమణి కవితమ్మ స్వగృహం నుంచి జ్యోతులు, దీలు, బోనాలు, పట్టు వస్త్రాలను సంప్రదాయబద్ధంగా ఊరేగింపుగా తీసుకెళ్లి అమ్మవారికి సమర్పించారు. ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు. చుట్టుపక్కల గ్రామాల నుంచి మహిళలు భక్తిశ్రద్ధలతో ఉపవాసంతో దీలు, బోనాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. రాత్రి విద్యుత్ దీపాలతో అలంకరించిన చాందినీ బండ్ల మెరవని సాగింది. సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను అలరింపజేశాయి. పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చారు.

'పది' ఫలితాలు ఎందుకు తగ్గాయో చెప్పండి



మండల మీట్‌లో ప్రశ్నిస్తున్న బైసాని చంద్రశేఖర్ రెడ్డి

కురబలకోట: ప్రైవేటు స్కూళ్ల కన్నా మెరుగ్గా వసతి, సౌకర్యాలు కల్పించారు..నాడు– నేడు..అమ్మఒడి..నాణ్యమైన మధ్యాహ్న భోజనం..జగనన్న విద్యా కానుకతో పాటు రాష్ట్ర ప్రభుత్వం సకల సౌకర్యాలు కల్పించింది. టీచర్ల కొరత అసలే లేదు..ఇంత చేసినా ఈసారి పది ఫలితాల్లో ఎందుకు వెనుకబడ్డామో చెప్పాలని ఎంఈఓ ద్వారకనాథ్‌ను మండల మీట్‌లో మండల పరిషత్ ప్రత్యేక ఆహ్వానితులు బైసాని చంద్రశేఖర్ రెడ్డితో పాటు పలువురు సర్పంచులు, ప్రజాప్రతినిధులు నిలదీశారు. బుధవారం స్థానిక మండల పరిషత్ మీటింగ్ హాల్‌లో జెడ్పీటీసీ బైసాని జ్యోతి నేతృత్వంలో ఎంపీపీ బి. దస్తగిరి అధ్యక్షతన మండల మీట్ సాగింది. వివిధ శాఖల అధికారులు ప్రగతి నివేదికలు వెల్లడించారు. ఈ సందర్భంగా బైసాని చంద్రశేఖర్ రెడ్డి మాట్లాడుతూ ఎంతో ఘన చరిత్ర ఉన్న స్కూల్‌లో ఈసారి 24 శాతం మాత్రమే పదిలో ఫలితాలు రావడం ఆలోచించాల్సిన విషయమన్నారు. ఆశించిన ఫలితాలు ఎందుకు రాలేదని ప్రశ్నించారు. ఈ విషయాన్ని జిల్లా కలెక్టర్ ఇతర విద్యా శాఖ ఉన్నతాధికారుల దృష్టికి కూడా తీసుకెళతామన్నారు. ఈ విషయమై ఆ హైస్కూల్ హెడ్మాస్టర్ త్రివేణిని విచారించగా ఎక్కువ మంది విద్యార్థులు ఒకటి రెండు సబ్జక్టుల్లో ఫెయిలయ్యారన్నారు.

కలెక్టర్ ఆగ్రహంతో కదిలిన అధికార యంత్రాంగం

బి.కొత్తకోట: బి.కొత్తకోట నగర పంచాయతీ పరిధిలోని కురవానికమంట జగనన్న కాలనీలో వసతుల కల్పన, ఇళ్ల నిర్మాణాల జాప్యంపై అధికారుల్లో కదలిక వచ్చింది. బుధవారం అధికారులు కాలనీలో తిష్టవేసి పనులు చేయిస్తున్నారు. గత శనివారం కలెక్టర్ గిరీషా కాలనీలో ఇళ్ల నిర్మాణాలపై ఆకస్మిక తనిఖీ చేసి ఇక్కడి పరిస్థితులపై అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. తక్షణమే చర్యలు చేపట్టకపోతే సస్పెండ్ చేస్తానంటూ హెచ్చరించారు. దీనిపై మదనపల్లె డివిజనల్ డెవలప్‌మెంట్ అధికారి లక్ష్మీపతి క్షేత్రస్థాయిలో శాఖల అధికారులను సమన్వయం చేస్తూ పనులకు శ్రీకారం చుట్టారు. ఇక్కడ 502 మంది నిరుపేదలకు ఇళ్లస్థలాలను మంజూరు చేశారు. 176 మంది ఇళ్లనిర్మాణాలు చేపట్టగా మిగిలిన లబ్ధిదారులు పనులకు దూరంగా ఉన్నారు. దీనితో డీఎల్‌డీఓ లక్ష్మీపతి, హౌసింగ్ డీఈ శ్రీహరిరావు, మేనేజర్ బి.రమాదేవి, డిజిటల్ అసిస్టెంట్ జియా, కోఆప్షన్ సభ్యులు నాసిర్, సిబ్బంది బుధవారం కాలనీలో నిర్మాణాలు చేసుకుంటున్న ప్రతి లబ్ధిదారుని వద్దకు వెళ్లి పనులు సత్వరమే పూర్తి చేయించాలని కోరారు. కాలనీలో ఇంటర్నల్ మట్టి రోడ్ల నిర్మాణాలు, నీటి సరఫరా పైప్‌లైన్ ఏర్పాటు, అప్రోచ్‌రోడ్డు పనులు ప్రారంభించారు. కాలనీలో మధ్యలోని కాలువపై కల్వర్టుల నిర్మాణ పనులు మొదలు పెట్టారు. కాలనీలో పచ్చదనం కోసం మొక్కలు నాటించనున్నట్టు లక్ష్మీపతి చెప్పారు. ఇళ్ల నిర్మాణాలు ప్రారంభించని లబ్ధిదారులకు నోటీసులు జారీ చేస్తున్నట్టు చెప్పారు. 10–15 రోజుల్లో అన్ని ఇళ్ల నిర్మాణాలు ప్రారంభించేలా చర్యలు తీసుకొంటామని చెప్పారు. అనంతరం మండల పరిషత్ కార్యాలయంలో హౌసింగ్ ఏఈలు, డిజిటల్ అసిస్టెంట్లు, వలంటీర్లు, వర్క్‌ఇన్స్‌పెక్టర్లతో లక్ష్మీపతి, శ్రీహరిరావు, సమావేశం నిర్వహించారు.